క్లుప్తంగా

రీసర్వే పక్కాగా చేయాలి



తాడిపర్రులో రెవెన్యూ రికార్డులను సిద్ధం చేస్తున్న అధికారులు

ఉండ్రాజవరం: భూసర్వేలో ఉన్న లోసుగులను తొలగించడానికి గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, పోరంబోకు భూముల్లో రీసర్వే చేపట్టినట్లు తహసీల్దార్ పీఎన్డీ.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం తాడిపర్రు గ్రామంలో రీసర్వే పక్కాగా చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా రీసర్వే కార్యక్రమంలో భాగంగా రికార్డులను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. గ్రామంలో 1,425 ఎకరాలకు గాను 1,300 మంది రైతులకు సంబంధించి రీసర్వే చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు చిట్టిబాబు, రాజ్యలక్ష్మి, లక్ష్మీసరసమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సెప్టెంబర్ 13న లోక్ అదాలత్

తాళ్లపూడి(కొవ్వూరు): రాష్ట్ర న్యాయాధికార సేవ సంస్థల ఆదేశాల మేరకు కొవ్వూరు కోర్టులో సెప్టెంబర్ 13 వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్, 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అనురాధ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, భార్యభర్తల భరణం, డొమెస్టిక్ వాయిలెన్స్, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు బకాయిలు, ప్రీ లిటిగేషన్, టెలిఫోన్ బకాయిలు, ప్రామిసరీ నోట్ కేసులు రాజీ చేసుకోవచ్చనన్నారు. కేసులు రాజీతో సమయం, డబ్బు ఆదా అవుతాయని ఆమె అన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల కక్షిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

ముమ్మరంగా ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణం



తాళ్లపూడిలో ట్యాంక్‌ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఈ

తాళ్లపూడి: జల జీవన్ మిషన్‌లో భాగంగా మండలంలో రెండు గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సూర్యహాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని తాళ్లపూడిలో రూ.31.60 లక్షలు, వేగేశ్వరపురంలో రూ.34.61 లక్షలతో 40 వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంక్‌ల నిర్మాణాలకు జల జీవన్ మిషన్ ద్వారా నిధులు మంజూరయ్యాయనన్నారు. ఆయన వెంట సంబంధిత శాఖ డీఈ ఎన్ పార్వతి, ఈఈ.బీవీ గిరిలు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక



వింత అమర్ ప్రసాద్‌రెడ్డి (ఫైల్)

గోపాలపురం: మండల కేంద్రం గోపాలపురం గ్రామ వైఎస్సార్ సీపీ నూతన అధ్యక్షుడిగా గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వింత అమర్ ప్రసాద్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక సీనియర్ నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి నివాసం వద్ద సోమవారం మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి అధ్యక్షతన నూతన గ్రామకమిటీ ఎన్నిక నిర్వహించారు. పార్టీ ఆదేశాలు పాటిస్తూ ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉండి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, మాజీ హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ తానేటివనిత ఆదేశాలతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటానని ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. నాయకులు కార్యకర్తలు పలువురు ఆయనను అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికలు

చాగల్లు: గత నెల 22వ తేదీన దేవరపల్లి జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి బాలికల అండర్-13 ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొన్న చాగల్లు జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఆరుగురు విద్యార్థినిలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు పాఠశాలలో చదువుతున్న జై దుర్గా, కౌసల్య, దీపిక, అనూష, పావని, వర్షితలు ఎంపికయ్యారని పీడీ ఉపాధ్యాయురాలు జె.విజయలక్ష్మి సోమవారం ఓ ప్రటనలో తెలిపారు. ఈ నెల 5,6 తేదీలలో మదనపల్లిలో జరగనున్న రాష్ట్రస్థాయి అండర్-13 ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని ఆమె వివరించారు.

మానవత ఆర్థిక సాయం

గోపాలపురం: మండల కేంద్రం గోపాలపురం బీసీ కాలనీకి చెందిన కానూరి హరి కిడ్నీ, లివర్ వ్యాధులతో బాధపడుతున్నాడు. మానవత సభ్యులు సోమవారం వైద్యం నిమిత్తం రూ.6వేలు ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మండల చైర్మన్ జొన్నల గడ్డ రాంబాబు మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ మానవత సంస్థ అందుబాటులో ఉంటుందని సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

పగలే వెలుగులు

- ఎల్ఈడీ లైట్లు బాగు చేసేది ఎప్పుడో .!
- పట్టించుకునే నాథుడు కరవు
- పంచాయతీలకు గుదిబండగా నిర్వహణ
- అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ వృథా

నిడదవోలు రూరల్: పల్లెల్లో రాత్రి వేళా వెలుగులు నింపడంతో పాటు పంచాయతీలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలన్నా ఉద్దేశంతో 2017 ఏడాదిలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసింది. ఇందుకు కోట్ల రూపాయలు వెచ్చించి ఈఈఎస్ఎన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆ సంస్థ పంచాయతీల్లో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుచేసి చేతులు దులుపుకుంది. నియోజకవర్గంలోని నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో 16,214 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. పదేళ్లపాటు వీటి బాగోగులను చూడాల్సిన బాధ్యత ఆ సంస్థదే. కానీ పలుప్రాంతాల్లో మరమ్మతులకు గురైనా అవి పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతూన్న ఈఈఎస్ఎన్ సంస్థ పట్టించుకోవడం లేదు. మరికొన్ని గ్రామాల్లో సగానికి పైగా ఎల్ఈడీ లైట్లు మరమ్మతులకు గురవ్వడంతో వాటి స్థానంలో గతంలో ఉండే ట్యూబ్‌లైట్లనే వాడుతున్నారు. దీంతో విద్యుత్ చార్జీల భారం తగ్గడం మాట అటుంచితే, ప్రస్తుతం పెరిగిన నిర్వహణ ఖర్చులతో పంచాయతీలకు లైట్ల నిర్వహణ గుదిబండగా మారింది. పంచాయతీలకు వీధిలైట్ల నిర్వహణ అదనపు భారమవుతోందని అధికారులు వాపోతున్నారు.

నిర్లక్ష్యం..పర్యవేక్షణ లోపం

నిడదవోలు మండలంలోని 23 గ్రామాలుండగా మేజర్ పంచాయతీ గ్రామమైన సమిశ్రగూడెంలో 466 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. అయితే వీటిలో 200 పైగా ఎల్ఈడీ లైట్లు వెలగకపోవడంతో వాటి స్థానంలో తాత్కాలికంగా ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. పాడైన ఎల్ఈడీ లైట్లను ప్రైవేటు ఎలక్ట్రిషియన్‌తో మరమ్మతులు చేయిస్తున్నారు. కాటకోటేశ్వరం, కోరుమామిడి, పురుషోత్తపల్లి గ్రామాలతో పాటు ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని గ్రామాల్లో ఈదురుగాలులకు వెనుక వైపునకు తిరిగిపోయాయి. వర్షాలు కారణంగా కనెక్షన్ల వద్ద కార్బన్ పట్టి మరమ్మతులకు గురై ఎల్ఈడీ లైట్లు వెలగడం లేదు. అధికారుల నిర్లక్ష్యం సిబ్బంది పర్యవేక్షణ లోపంలో మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ఆటోమేటిక్ సిస్టమ్ వైఫల్యం

పట్టపగలు (వీధి) దీపాలు వెలగడం అనేది విద్యుత్ వృధాకు కారణమయ్యే ఒక సమస్య. ఇది ప్రధానంగా ఆన్-ఆఫ్ ఆటోమేటిక్ సిస్టమ్‌లు పనిచేయకపోవడం, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ ఫెయిల్ అవ్వడం లేదా అధికారుల నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల సంభవిస్తుంది. సీసీఎంఎస్ అంటే సెంట్రల్ కమాండ్ మోనిటరింగ్ సిస్టమ్. ఈ విధానంలో శివారునున్న విద్యుత్ స్తంభం వద్ద సీసీఎంఎస్ పరికరాన్ని అమర్చుతారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శి సెల్‌ఫోన్‌లోని ప్రత్యేక యాప్ ద్వారా సాయంత్రం 6 గంటల నుంచి ఎల్ఈడీ లైట్లు వెలిగేలా, తిరిగి ఉదయం 6 గంటలకు ఆగిపోయేలా నియంత్రించవచ్చు. దీంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా వెలిగించేందుకు, అర్పివేసేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాల్సివుంది. అయితే అనేక ప్రాంతాల్లో సీసీఎంఎస్‌ను ఏర్పాటు చేయలేదు. గతంలో వీధిదీపాలు మరమ్మతులకు గురైనపుడు స్థానింగా ఉండే పంచాయతీ సిబ్బంది బాగుజేసేవారు. ప్రస్తుతం ఎల్ఈడీ దీపాలు మరమ్మతులకు గురైనా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు.

ప్రజల అసంతృప్తి

ప్రభుత్వం విద్యుత్ వృధాను అరికట్టాలని చెబుతున్నప్పటికీ, స్థానిక ప్రజలు ఫిర్యాదులు చేసిన సంబంధిత అధికారులు వెంటనే స్పందించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మరమ్మతులకు గురవ్వడంతో ఖాళీగా దర్శనమిస్తున్న విద్యుత్ స్తంభం



లైట్ల నిర్వహణకు ఏర్పాటు చేసిన సీసీఎంఎస్ బాక్సు



అట్లపాడులో మరమ్మతులకు గురైన ఎల్ఈడీ లైటు



సమిశ్రగూడెంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ట్యూబ్‌లైట్

> **ఇబ్బందులు లేకుండా మరమ్మతులు**
>
> పలు ప్రాంతాలలో ఎల్ఈడీ వీధిలైట్లు మరమ్మతులకు గురైనట్లు పంచాయతీ కార్యదర్శుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రైవేటు వ్యక్తులతో ఎల్ఈడీలు మరమ్మతులు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నాం.
>
> –జగన్నాథరావు, ఎంపీడీఓ, నిడదవోలు

కార్యకర్తల కుటుంబాలకు వనిత పరామర్శ



యాదవోలులో షేక్ సుభానీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తానేటి వనిత

దేవరపల్లి: మండలంలోని ఇటీవల వివిధ కారణలతో మృతి చెందిన, అనారోగ్యంతో చికిత్స పొందుతన్న పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ హోంమంత్రి, నియోజకవర్గ ఇంచార్జి తానేటి వనిత సోమవారం నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ మేరకు మండలంలోని యాదవోలులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పోస్ట్‌మెన్ షేక్ సుభానీ, కరుటూరి చెంచయ్య కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. దండ్రు వీరాస్వామి కుమారుడు వీరవాస్ ఇటీవల మరణించడంతో కుటుంబాన్ని కలిసి సానుభూతి వ్యక్తం చేశారు. అనంతరం అనారోగ్యంతో బాధపడతున్న జాలాది ప్రసాద్ యోగా క్షేమాలను అడిగి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ సర్పంచ్ సున్నం వరప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్, జిల్లా కమిటీ కార్యదర్శి ఆరేటి సూర్యనారాయణ, యువజన విభాగం అధ్యక్షుడు ఆనిశెట్టి సూర్యచంద్రం, మైనార్టీ విభాగం నియోజకవర్గ నాయకుడు షేక్ ముస్తఫా, తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సమన్వయంతో ఫిర్యాదులను పరిష్కరించాలి : ఆర్డీవో



అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాణి సుస్మిత

తాళ్లపూడి(కొవ్వూరు): 'మీ కోసం – పీజీఆర్ఎస్' వేదికలో వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరానికి వెంటనే తక్షణ చర్యలు తీసుకొవాలని కొవ్వూరు ఆర్డీవో డాక్టర్ రాణి సుస్మిత సూచించారు. డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా కార్యక్రమానికి హాజరై సమస్యలను గుర్తించి ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారాలను అందించాలన్నారు. సోమవారం కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన 'మీ కోసం – పీజీఆర్ఎస్' కార్యక్రమంలో ఆమె పాల్గొని స్వయంగా అర్జీలను స్వీకరించారు. కొవ్వూరుకి చెందిన అల్లూరి దుర్గ ఒంటరి మహిళ పెన్షన్‌ను పునరుద్ధరించాలని, గోపాలపురం మండలం దొండపూడి గ్రామానికి చెందిన తూరపాటి పద్మ కొవ్వూరు పట్టణంలోని రోడ్డు విస్తరణ కారణంగా షాపు తొలగించినందున జీవనోపాధి కోల్పోయానని, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాన్ని చూపించాలని అభ్యర్థిస్తూ తదితర అర్జీలు 13 ఆర్జీలు స్వీకరించామని వివరించారు. ప్రజల సమస్యలను అధికారులు సమన్వయంతో వేగంగా పరిష్కరించేందుకు ప్రతివారం రెండు రోజులు శాఖల వారీగా సమావేశాలు నిర్వహించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల డుమ్మా

- ఉన్నతాధికారుల మాట పెడచెవిన
- కేవలం ఎంపీడీఓతో నడిచిన పీజీఆర్ఎస్



అధికారులు లేకపోవటంతో వెలవెలబోతున్న పీజీఆర్ఎస్

పెరవలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని సోమవారం అధికారులు డుమ్మా కొట్టడంతో ఫిర్యాదు దారులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకొవాలో అర్థంకాక తర్జనభర్జన పడ్డారు. కేవలం ఇన్‌చార్జి ఎంపీడీఓ ఘంటా శ్రీనివాస్‌రావు, ఇరిగేషన్ ఏఈ మాత్రమే మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. అనంతరం 11 గంటలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ రాగా, మిగిలిన శాఖాల అధికారులు తమ అసిస్టెంట్‌లను పంపించారు. పీజీఆర్ఎస్‌లో ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు వస్తుంటాయి. కానీ ఆయా విభాగాలకు సంబంధించి అధికారులు హాజరుకాకపోవడంతో వచ్చిన ఫిర్యాదు దారులు అంతా ఉసూరుమంటూ తిరిగివెళ్లిపోయారు. ఈ కారణంతోనే పీజీఆర్ఎస్‌ను అర్జీదారులు చులకనగా చూస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్లలో దళారుల దోపిడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు



హాజరైన ఎంపీటీసీ సభ్యులు, అధికారులు

దేవరపల్లి: రైతులు పండించిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిబంధనలతో దళారులు ఎక్కువ శాతం లబ్ధి పొందుతున్నారని, రైతులకు మద్దతు ధర లభించడంలేదని ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల వెంకటరత్నం మండిపడ్డారు . మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు అధ్యక్షతన సోమవారం సాయంత్రం జరిగిన దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి పచ్చి ధాన్యం ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయదని ఆయన అధికారులను ప్రశ్నించారు. ఎండబెట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నారని, పచ్చిధాన్యం, తేమ ఉన్న ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని రైతన్నలు నష్టపోతున్నారన్నారు.

తేడా ఎందుకు వస్తుంది..

యర్నగూడెం ఎంపీటీసీ సభ్యుడు బొంతా చిన బాబు మాట్లాడుతూ ఎంతో శ్రమపడి పండించిన ధాన్యాన్ని మిల్లుకు తీసుకువెళితే నూకశాతం పేరుతో కోత విధించి, లారీకి రూ.10 వేలు వసూలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా చార్జీలు, హమాలీ ఖర్చులు, ఎగుమతి దిగుమతి చార్జీలు, గోనే సంచుల డబ్బులు ప్రభుత్వం ఇంత వరకు చెల్లించలేదన్నారు. రైతు సేవా కేంద్రం వద్ద తేమ శాతం 17 చూపించగా, మిల్లు వద్ద 19 శాతం వస్తుందని, అసలు తేడా ఎందుకు వస్తుందని ఆయన అధికారులను ప్రశ్నించారు. మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ మాట్లాడుతూ నూకశాతం అనేది ఎక్కడా లేదని, అలా అక్రమంగా డబ్బులు కట్టమంటే కట్టవద్దని ఆయన సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు కొర్లపాటి అరుణ, సాదే సుబ్బారావు, ఎంపీడీఓ వై. రాజారావు, తహసీల్దార్ ఎం. శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

కొత్త సెల్‌ఫోన్లు అందించండి



కొవ్వూరు సీడీపీవోకు సెల్‌ఫోన్లు ఇచ్చేస్తున్న అంగన్‌వాడీలు



తాళ్లపూడిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు

తాళ్లపూడి (కొవ్వూరు): కొవ్వూరు ప్రాజెక్టు పరిధిలోని 223 కేంద్రాల అంగన్‌వాడీ వర్కర్లు సీడీపీవో నాగలక్ష్మికి తమ స్మార్ట్ ఫోన్లను తిరిగి ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు, అంగన్‌వాడీ కొవ్వూరు ప్రాజెక్ట్ నాయకురాలు సీహెచ్ మాణిక్యాంబ సీడీపీవో కార్యాలయం వద్ద మాట్లాడుతూ సమాచారం సేకరణలో భాగంగా 2022లో ఈ ఫోన్లు ఇచ్చారని, 4జీ నెట్వర్క్ సరిగ్గా అందడం లేదని దీంతో విధుల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ట్యాబ్‌లు సరిగ్గా పని చేయట్లేదని వెంటనే 5జీ నెట్వర్క్‌తో పనిచేసే ట్యాబ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిబ్బంది జీతాలు కూడా పెంచాలని డిమాండ్స్‌తో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు తదితర మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

యాప్‌ల భారం మోయలేక పోతున్నాం

తాళ్లపూడి: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో పెరిగిన యాప్‌ల భారాన్ని మోయలేక పోతున్నామని, సాంకేతిక ఇబ్బందులు కారణంగా అవస్థలు పడాల్సి వస్తుందని తాళ్లపూడి మండలంలోని అంగన్‌వాడీ వర్కర్లు వాపోతున్నారు. విధుల నిర్వహణకు ట్యాబ్‌లు వినియోగించడం కొండంత భారంగా మారిందన్నారు. మొబైల్‌లో పోషణ, ట్రాకర్ యాప్, సంజీవిని, మిల్క్, టీఎచ్ఆర్ యాప్‌లలో వివరాలను అప్‌లోడ్ చేసే సమయంలో ట్యాబ్‌కు సిగ్నల్స్ అందకపోవటంతో పని ఆగిపోతుందన్నారు. గర్భిణులకు నెలకు రెండు సార్లు టీఎస్ఆర్ ఇచ్చేందుకు అవకాశం ఉండటం లేద న్నారు. గంటల తరబడి యాప్‌లతో గడపాల్సి వస్తుందని వివరించారు. స్థానిక సీడీపీఓ కార్యాలయంలో అండ్రాయిడ్ ఫోన్‌లను అప్పగించారు. 5జీ సామర్థ్యం కలిగిన కొత్త ట్యాబ్‌లను సరఫరా చేయాలని, పనిభారం, తగ్గించాలని, జీతాలను తక్షణం పెంచాలని వర్కర్లు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



గౌరీపట్నం వద్ద లారీ ఢీ కొని మృతి చెందిన మహావీర సాయి నవీన్

దేవరపల్లి: దేవరపల్లి మండలం గౌరీపట్నం సమీపంలోని సమోసా రెస్టారెంట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం రాజమహేంద్రవరంలోని వెంకటనగరంకు చెందిన చెలమశెట్టి మహావీరసాయి నవీన్(25) తెలంగాణా రాష్ట్రంలోని అశ్వారావుపేటలో పేపరు మిల్లులో పనిచేస్తున్నాడు. సోమవారం రాజమహేంద్రవరం బైక్‌పై వెళుతుండగా గౌరీపట్నం వద్ద వెనుక వైపు నుంచి వస్తున్న లారీ బైక్‌ను బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో యువకుడు అక్కడక్కడే మృతి చెందినట్లు సీఐ బి.నాగేశ్వర్ నాయక్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రోగులకు పౌష్టికాహారం పంపిణీ



బెంచీలను ప్రారంభిస్తున్న మీసాల హరిప్రసాద్, రొటేరియన్స్

నిడదవోలు: రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో సోమవారం క్లబ్ అధ్యక్షుడు మీసాల హరిప్రసాద్ సతీమణి దుర్గాంబ జ్ఞాపకార్థం వారి కుమారుడు మీసాల కాశిబాబు, కనకమహాలక్ష్మీ దంపతుల ఆర్థిక సహకారంతో పట్టణ ప్రభుత్వాసుపత్రిలో రోగులు, వారి సహాయకులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సమిశ్రగూడెం గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.14 వేల ఖర్చుతో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున, మూడో వార్డులో రెండు చొప్పున సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, కోశాధికారి గుంటిపల్లి సత్యసాయి, ఉప్పులూరి రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: స్థానిక విద్యుత్ సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ రామన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ రూరల్ ఫీడర్‌పై మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎన్. నారాయణ అప్పారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్‌లోని ఆర్డీఎస్ పనుల నిమిత్తం ధుమంతునిగూడెం, కొత్తగూడెం, సుబ్బరాయపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన వివరించారు.

రొమ్ము క్యాన్సర్‌కు చెక్



గర్భిణులకు తల్లి పాలు ప్రాముఖ్యతను వివరిస్తున్న డాక్టర్ అన్నపూర్ణ

తాళ్లపూడి: అప్పుడే పుట్టిన పిల్లలకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలని వైద్యాధికారి డా.అన్నపూర్ణ తెలిపారు. తల్లి పాలు వారోత్సవాలులో భాగంగా మండలంలోని తాళ్లపూడి, మలకపల్లి సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం అన్నదేవరపేట, మలకపల్లి, పెద్దేవం వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాలు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. మలకపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డా.అన్నపూర్ణ బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలతో రోగనిరోధక శక్తి అందింతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు భానుమతి, భాగ్యకుమారి, ఏఎన్ఎం, మహిళా పోలీసులు హెల్త్ సూపర్‌వైజర్ గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే శిశువుకు ఆరోగ్యం

ఉండ్రాజవరం: తల్లిపాలతోనే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ వై.సృజన అన్నారు. మండలంలో వేలివెన్ను ఆరోగ్య కేంద్ర పరిధిలో కాల్ధారి గ్రామంలో సంచార చికిత్స కార్యక్రమంలో భాగంగా సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై గర్భిణిలకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన అరగంట లోపు ముర్రుపాలు తప్పనిసరిగా బిడ్డకు తాగించాలన్నారు. బిడ్డకు తల్లిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల పాటు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. అనంతరం ప్రత్యామ్నాయ ఆహారం అందజేయాలన్నారు. పలువురు గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్తహీనత భారిన పడకుండా తీసుకోవలసిన పోషక ఆహారం, ఐరన్ మాత్రలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య పర్యవేక్షకురాలు కె.సుభాషిణి, డి.అనూష, జి.రత్నకుమారి, ఆశా కార్యకర్తలు పద్మిని, నాగమణి, సంధ్యారాణి, లలిత, సరోజిని, ఎస్‌సీపీ డీఈవో అరుణ పాల్గొన్నారు.

ముర్రుపాలతో రొమ్ము క్యాన్సర్ దూరం

దేవరపల్లి: బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లి ముర్రిపాలు పట్టాలని గోపాలపురం సీడీపీఓ డి.మమ్మి తల్లులకు సూచించారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వారోత్సవాలను నిర్వహించారు. ముర్రిపాలుతో బిడ్డను అంటు వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చునని ఆమె తెలిపారు. గ్రామంలో తల్లులు, అంగన్‌వాడీ వర్కర్లతో అవగాహన ర్యాలి నిర్వహించారు. సీహెచ్ఓ సత్యవతి, పీహెచ్ఎన్ పి. విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్వేజర్లు ఎం.విజయలక్ష్మి, ఎం.శశికళ, బి.విజయశాంతి పాల్గొన్నారు.



దేవరపల్లిలో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

నల్లజర్లలో..

మండలంలోని తూర్పు చోడవరంలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. నవజాత శిశువుకు తల్లిపాలు తాగించడం, శిశువు బాగోగులు వంటి అంశాలపై తల్లుకు వివరించారు. పాలు ఇవ్వడం వల్ల రొమ్ము క్యాన్సర్ రాదని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వేజరు కృష్ణవేణి, జీఎంఎస్‌కే సుమా సిబ్బంది పాల్గొన్నారు.